సాక్షి
నిజామాబాద్
శనివారం । 29 । జూలై । 2023



దరఖాస్తులు బుట్టదాఖలేనా..?
మైనారిటీ కార్పొరేషన్ ద్వారా రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఆశలు ఇప్పటికీ నెరవేరడం లేదు.
- 8లో ▸



త్వరలో తహసీల్దార్ల బదిలీలు
రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న దృష్ట్యా త్వరలో జిల్లాలో తహసీల్దార్ల బదిలీలు జరిగే అవకాశాలున్నాయి.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
24.3 /22.5

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం మేఘావృతమవుతుంది. చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. సాయంత్రం మోస్తరు వర్షం కురియవచ్చు.

న్యూస్‌రీల్

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



వేల్పూర్ : భారీ వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. వేల్పూర్ మండలం జానకంపేట్, పచ్చలనడ్కుడ గ్రామాల్లో వర్షం వల్ల దెబ్బతిన్న పంటలను కాంగ్రెస్ నాయకులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రైతులందరూ దాదాపు 75 శాతం పెట్టుబడి పెట్టిన తర్వాత భారీ వరదలు పంటలను పూర్తిగా ముంచెత్తాయన్నారు. వరదనీటిలో పంటలు ఆనవాళ్లు లేకుండా కొట్టుకుపోయాయని, పొలాల్లో ఇసుక మేటలు వేసిందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఎకరానికి రూ. 25 వేల సాయం అందించాలన్నారు. గతేడాది కూడా ఇదే సమయంలో భారీ వర్షాలతో జిల్లా రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని, ప్రభుత్వం ప్రకటించిన పంట నష్టం రూ. 10వేల సాయం ఏ ఒక్క రైతుకు కూడా అందలేదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నీరడిభాగ్య, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

రేపు మహాయజ్ఞం



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : నగరంలోని న్యాల్‌కల్ రోడ్డులో ఉన్న మున్నూరుకాపు కల్యాణ మండపంలో ఆదివారం శ్రీ సుదర్శన నారసింహ అష్టోత్తరశత కుండాత్మక ఏకాహ్నిక మహాయజ్ఞం నిర్వహించనున్నారు. ఈ మేరకు శుక్రవారం నిర్వాహకులు కరపత్రం విడుదల చేశారు. కందాళై నరసింహమూర్తి(నానిస్వామి) ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ క్రతువులో తమిళనాడు శ్రీవిల్లిపుత్తూరుకు చెందిన త్రిదండి శఠగోప రామానుజ జీయర్ స్వామి, హిమాలయాల పాదాల చెంతనున్న శ్రీవైష్ణవ గంగోత్రి మఠంకు చెందిన త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి, ఆచార్య రామానుజదాస స్వామి పాల్గొని పర్యవేక్షణ చేయనున్నారు. ఉదయం 9 గంటలకు యజ్ఞం ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 1 గంటకు అన్నప్రసాద వితరణ చేయనున్నారు. అనంతరం వరుసగా భూనీళా సమేత వెంకటేశ్వర స్వామి, లక్ష్మీ నారసింహ స్వామి, సీతారామ స్వామి వార్ల కల్యాణాలు నిర్వహించనున్నారు. సాయంత్రం స్వామీజీల ప్రవచన కార్యక్రమం చేయనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు. 9959944531లో సంప్రదించాలని కోరారు.

బోధనేతర పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

సుభాష్‌నగర్ : జిల్లాలోని ఇందల్వాయి ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలలో పూర్తి స్థాయి తాత్కాలిక పద్ధతిన బోధనేతర సిబ్బందిని ఔట్ సోర్సింగ్ పద్ధతిలో సేవలకుగాను దరఖాస్తులు స్వీకరిస్తున్నామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో వంట మనుషులు, కిచెన్ సహాయకులు, స్వీపింగ్ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది, సెక్యూరిటీ గార్డు పోస్టుల కోసం ఈనెల 31 సాయంత్రం 5 గంటల వరకు ఈఎంఆర్‌ఎస్ ఇందల్వాయి పాఠశాలలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పదో తరగతి పాసైన కొత్త నిజామాబాద్ జిల్లాలో బోనోఫైడ్ అభ్యర్థులకు మాత్రమే అవకాశం ఉందన్నారు. గెజిటెడ్ అధికారితో ధృవీకరించిన అర్హత పత్రాలతో దరఖాస్తులు సమర్పించాలన్నారు. సెక్యూరిటీ గార్డు పోస్టులకు మాజీ సైనికులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు వివరించారు. ఎంపిక ప్రక్రియ పూర్తి మెరిట్ ఆధారంగా చేస్తామని కలెక్టర్ చెప్పారు.

నిజాంసాగర్‌లోకి భారీ ఇన్‌ఫ్లో

నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టులోకి భారీ ఇన్‌ఫ్లో వస్తోంది. శుక్రవారం ప్రాజెక్టులోకి 45 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 2, 3, 4, 6, 7, 10 నంబర్ల వరద గేట్లను ఎత్తి అంతే నీటిని దిగువకు వదులుతున్నామన్నారు. నిజాంసాగర్ పూర్తి స్థాయి నీటిమట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా శుక్రవారం సాయంత్రానికి 1404.66 అడుగుల(17.311 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

వర్షం మిగిల్చిన విధ్వంసం

మూడెకరాల్లో నష్టపోయా..



వర్షాల వలన వరి నాట్లు వేసిన మూడెకరాల భూమిలో పంటను నష్టపోయాను. చెరువు అలుగు కొట్టేయడం వలన నీరు అధికంగా పంటపొలాల్లోకి వచ్చి ఇసుక మేటలను వేసింది. మొత్తం ఇసుకతోనే నిండిపోయింది. ప్రభుత్వమే ఆదుకోవాలి.
– మోహన్‌రెడ్డి, రైతు, రెంజర్ల


- 33,429 ఎకరాల్లో పంటల నష్టం
- వందల ఎకరాల్లో ఇసుక మేటలు వేసిన పొలాలు
- 20 రోడ్లపై పారుతున్న వరద నీరు, తెగిన చెరువుల కట్టలు, ధ్వంసమైన వంతెనలు
- వరద నీటికి ఇద్దరు గల్లంతు
- నీటి పారుదల శాఖకు రూ. రెండు కోట్లు నష్టం
- 273 మందికి పునరావాసం


బాల్కొండ మండలం రెంజర్లలో వరి పొలంలో ఇసుక మేట

జిల్లాలో వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు..

మండలాలు	వర్షంపాతం (మి.మీ.)	మండలాలు	వర్షంపాతం
		మాక్లూర్	141.7
వేల్పూర్	124.8	ధర్పల్లి	130.5
నవీపేట	245.8	పోతంగల్	110.0
భీమ్‌గల్	168.2	బోధన్	111.5
జక్రాన్‌పల్లి	141.0	ఇందల్వాయి	86.4
మోర్తాడ్	144.5	ఆర్మూర్	128.8
డొంకేశ్వర్	136.5	ఎడపల్లి	113.3
డిచ్‌పల్లి	112.6	చందూరు	108.4
నందిపేట	140.0	మెండోరా	91.3
సిరికొండ	196.0	సాలూర	115.0
ఆలూరు	178.0	నిజామాబాద్‌రూరల్	117.5
కమ్మర్‌పల్లి	131.5	రుద్రూరు	95.7
కోటగిరి	106.1	నిజామాబాద్‌నార్త్	109.5
వర్ని	97.2	ముప్కాల్	72.7
ఏర్గట్ల	127.5	మోస్రా	98.5
రెంజల్	140.2	మోపాల్	102.5
బాల్కొండ	99.3	నిజామాబాద్‌సౌత్	92.0

16
తెగిన చెరువుల కట్టలు..


వేల్పూర్‌లో తెగిన కాడి చెరువు కట్ట

54
కోతకు గురైన రోడ్లు


గొట్టుముక్కల వద్ద కొట్టుకుపోయిన బీటీ రోడ్డు

09
ధ్వంసమైన వంతెనలు


సాలూరా వద్ద వంతెనపై నుంచి పారుతున్న మంజీర

992
అలుగు పారుతున్న చెరువులు


అలుగు పారుతున్న గుండారం చెరువు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : జిల్లాలో వర్షం సృష్టించిన బీభత్సం భారీ నష్టాన్ని కలిగించింది. ఈ నెల 20, 24, 25, 26, 27 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా 24,035 మంది రైతులకు చెందిన 33,429 ఎకరాల్లో వరి, సోయా, మొక్కజొన్న, పసుపు పంటలు దెబ్బతిన్నాయి. అత్యధిక నష్టం 26, 27 తేదీల్లో కురిసిన వర్షంతో కలిగింది.

■ నవీపేట, ఆర్మూర్, మాక్లూర్, వేల్పూర్, మోర్తాడ్, కమ్మర్‌పల్లి, రుద్రంగి (మానాల గ్రామం) మండలాల్లో 16 చెరువుల కట్టలు తెగిపోయాయి. దీంతో వరద నీరు ఉధ్రుతంగా ప్రవహించి పలు రోడ్లు తెగిపోయాయి. మొత్తం 54 రోడ్లు కోతకు గురికాగా, 20 రోడ్లపై ఇప్పటికీ వరద నీరు పారుతోంది. 9 వంతెనలు ధ్వంసమయ్యాయి. ఇరిగేషన్ శాఖకు ఇప్పటివరకు రూ.2 కోట్ల మేర నష్టం కలిగినట్లు అధికారులు అంచనా వేశారు. పొలాల్లోకి భారీగా నీరు రావడంతో రైతులకు నష్టం వాటిల్లింది. వందల ఎకరాల్లో పంటల్లో ఇసుక మేటలు వేశాయి. జిల్లాలో 1,086 చెరువులకు గాను 992 చెరువులు అలుగులు పారుతున్నాయి. జిల్లాలో పలు మండలాల్లో పాత ఇళ్లు కూలిపోయాయి. 76 కుటుంబాలకు చెందిన 273 మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు.

■ శ్రీరాంసాగర్ జలాశయంలోకి ఎగువ నుంచి 1,75,000 క్యూసెక్కుల నీరు వస్తోంది. 18 గేట్లు ఎత్తి 58,000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయం సామర్థ్యం 1,091 అడుగులు (90 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 1,089 అడుగులు (79 టీఎంసీలు) నీరుంది. నందిపేట మండలంలో గురువారం ఒక వ్యక్తి, నిజామాబాద్ రూరల్ మండలంలో శుక్రవారం మరో వ్యక్తి వరద నీటిలో గల్లంతై మృతి చెందారు.

■ బోధన్ డివిజన్‌లోని సాలూర వద్ద మంజీర నది పాత వంతెనపై నుంచి వరద ఉధ్రుతంగా పారుతోంది. అధికారులు అంతర్రాష్ట్ర రోడ్డును తెలంగాణ–మహారాష్ట్ర వైపు మూసేశారు. ఎడపల్లి మండలంలో అలీసాగర్ రిజర్వాయర్ పూర్తి స్థాయిలో నిండడంతో రెండు గేట్లు ఎత్తి నీటిని వదులుతున్నారు. బోధన్ పట్టణ శివారులోని బెల్లాల్ చెరువు అలుగు ఉధృతంగా పారుతోంది.

■ బాల్కొండ నియోజకవర్గంలో మోర్తాడ్, తిమ్మాపూర్, కమ్మర్‌పల్లి, ఒడ్యాట్, భీమ్‌గల్, వేల్పూర్, ఏర్గట్ల, మెండోరా, బాల్కొండ మండలాల్లో పలు రోడ్లు కోతకు గురయ్యాయి. వివిధ చెరువులకు చిన్నచిన్న బుంగలు ఏర్పడి నీరు లీకవుతోంది. ఆర్ అండ్‌బీ అధికారులు రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టగా, చెరువుల వద్ద ఇరిగేషన్ అధికారులు మరమ్మతులు చేస్తున్నారు.

■ ఆర్మూర్ నియోజకవర్గంలోని మాక్లూర్ మండలం గొట్టిముక్కుల, మాందాపూర్, ధర్మోరా, మాణిక్ భండార్, అమ్రాద్ రహదారులు కొట్టుకుపోయాయి. అమ్రాద్ తండాలో ఇంకా నీటి ఉధ్రుతి దగ్గలేదు. రాకపోకలు బంద్ ఉన్నాయి. నాటిన పొలాలకు గండ్లు ఏర్పడ్డాయి. ఆర్మూర్ మండలం పిప్రి నుంచి మంథనికి వెళ్లే రోడ్డు ధ్వంసమైంది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఆర్మూర్ గుండ్లచెరువు నుంచి వరద వస్తుండడంతో ఆర్మూర్ నుంచి ఆలూరు బైపాస్ రోడ్డుపై ఇప్పటికీ నీరు ప్రవహిస్తోంది.

■ నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం సిరికొండ మండలంలో పలు గ్రామాల్లో పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. గడ్కోల్ వద్ద వంతెనల మీద నుంచి ప్రవహిస్తున్న కప్పలవాగు కారణంగా, సిరికొండ ఎల్లమ్మ చెరువు అలుగు నీరు గ్రామంలోకి వస్తుండడంతో సబ్‌స్టేషన్ వద్ద చీమన్‌పల్లి వైపు వెళ్లే రోడ్డును తవ్వేసి వరద నీటి మళ్లించారు. ఇందల్వాయి మండలం నల్లవెల్లి గ్రామంలో కల్వర్టు కోతకు గురైంది. జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ శివారులో పొలాలు నీటమునిగాయి.

నష్టపోయిన పంట వివరాలు

రైతులు	పంట	ఎకరాలు
14,957	వరి	21,697
3,500	సోయా	5,279
4,470	మొక్కజొన్న	5,006
1,108	పసుపు	1,447

ఉధృతంగా మంజీర

రుద్రూర్ : నిజాంసాగర్ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తి దిగువ ప్రాంతానికి వరద నీరు వదలడంతో శుక్రవారం పోతంగల్ మండల శివారులో మంజీర నది ఉధృతంగా ప్రవహిస్తోంది. మండలంలోని కల్లూర్, కొడిచర్ల, పోతంగల్, హంగర్గా, కారేగాం, సుంకిని గ్రామాల శివారు ద్వారా మంజీరా నది బోధన్ మండలంలో ప్రవేశిస్తుంది. నిజాంసాగర్ గేట్లు ఎత్తివేస్తున్నారనే సమాచారంతో రెవెన్యూ, పోలీస్ సిబ్బంది ఆయా గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు.

అంతర్రాష్ట్ర రాకపోకలు బంద్

బోధన్‌రూరల్(బోధన్) : భారీ వర్షాలతో నిజాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటిని దిగువకు వదలడంతో మంజీర నదిలో నీటి ప్రవాహం పెరిగింది. శుక్రవారం వరద ఉధృతి పెరిగి వంతెనపై నుంచి వెళ్తున్నాయి. దీంతో మంజీర నదిపై నుంచి తెలంగాణ–మహారాష్ట్రకు రాకపోకలు నిలిచిపోయాయి. వంతెనకు ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేశారు.

18 గేట్లు ఎత్తి గోదావరిలోకి..



బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి శుక్రవారం ఉదయం వరద తగ్గడంతో గోదావరిలోకి కూడా నీటి విడుదలను తగ్గించారు. ఉదయం 26 వరద గేట్ల ద్వారా లక్షా 80 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలారు. ఉదయం నుంచి నిలకడగా ఎగువ ప్రాంతాల నుంచి 2 లక్షల 33 వేల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్ట్ నుంచి కూడా నిలకడగా లక్ష 88 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. సాయంత్రానికి ప్రాజెక్ట్‌లోకి వరద నీరు లక్షా 75 వేల క్యూసెక్కులకు తగ్గడంతో 18 గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదలను 50 వేల క్యూసెక్కులకు తగ్గించారు. ప్రాజెక్ట్‌లో 82 టీఎంసీల వరకు మాత్రమే నీటి నిల్వ చేపట్టాలని సీఎం కేసీఆర్ ఆదేశించినట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు) అడుగులు కాగా శుక్రవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1089.20(80.65 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉంది. జల విద్యుతుత్పత్తి కేంద్రంలో 4 టర్బయిన్ల ద్వారా 34.47 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోంది.


కొనాపూర్–కొత్త చెరువు మధ్య వరదకు ధ్వంసమైన రోడ్డు


బోధన్ పట్టణ శివారులో అలుగు పారుతున్న బెల్లాల్ చెరువు


సిరికొండ సమీపంలోని పెద్దవాల్గోట్ వద్ద పడిపోయిన స్తంభాలు

చేపల మార్కెట్‌కు పచ్చజెండా

- అర్సపల్లి వద్ద నిర్మాణం
- రూ. 2 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- పనుల అప్పగింతకు కసరత్తు

డొంకేశ్వర్(ఆర్మూర్) : జిల్లా కేంద్రంలో చేపల మార్కెట్ ఏర్పాటుపై ఎట్టకేలకు కదలిక వచ్చింది. మత్స్యకారులకు ఉపాధినిచ్చే హోల్‌సేల్, రిటైల్ మార్కెట్‌ను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనకు ప్రభుత్వం ఓకే చెప్పింది. ఈ మేరకు 'నీలి విప్లవం' పథకం కింద రూ. 2 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వాస్తవానికి రూ.9.76 కోట్లు కావాలని జిల్లా మత్స్యశాఖ ప్రతిపాదనలు పంపింది. ముందైతే వచ్చిన డబ్బులతో నిర్మాణ పనులు ప్రారంభించాలని శాఖ కసరత్తు చేస్తోంది. నిర్మాణ బాధ్యతలను పంచాయతీరాజ్ శాఖకు లేదా ఆర్ అండ్‌బీ శాఖకు అప్పగించాలనే దానిపై కలెక్టర్‌కు ఫైల్ పెడుతున్నారు. నగరంలోని అర్సపల్లి వద్ద మత్స్య శాఖకు చెందిన 4.24 ఎకరాల ప్రభుత్వ స్థలం 2,848, 2,849 సర్వే నంబర్లలో ఉంది. ఈ స్థలంపై కొంత వివాదం నెలకొంది. వివాదం లేని రెండెకరాల స్థలంలో చేపల మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని అధికారులు భావిస్తున్నారు. మత్స్యకారులు చేపలను విక్రయించడానికి కావాల్సిన మడిగెలు, గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజీలు, వాహనాలకు పార్కింగ్, ప్రహరీ, తదితర పనులు చేపట్టాలని నిర్ణయానికి వచ్చారు. కలెక్టర్ కూడా అనుమతిస్తే వెంటనే పనులు ప్రారంభం కానున్నాయి.


జిల్లా కేంద్రంలోని అర్సపల్లిలో మత్స్యశాఖ స్థలం

ఏర్పాటైతే మత్స్యకారులకు ఉపాధి


కబ్జాకు గురవుతున్న మత్స్యశాఖ స్థలాన్ని కాపాడేందుకు గంగపుత్ర అభివృద్ధి కమిటీతో పాటు మత్స్యకారులు చాలా ఏళ్లుగా పోరాటం చేశారు. స్వయంగా కోర్టులో కేసు దాఖలు చేశారు. ఎన్నోసార్లు రెవెన్యూ అధికారులు సర్వే చేసి ఈ స్థలం మత్స్య శాఖదేనని తేల్చి చెప్పారు. ప్రస్తుతం నిధులు మంజూరు కావడంతో వివాదం లేని రెండు ఎకరాల స్థలంలో చేపల మార్కెట్‌ను నిర్మించాలని చూస్తున్నారు.

అనుమతి వచ్చింది

అర్సపల్లిలోని ప్రభుత్వ స్థలంలో చేపల మార్కెట్‌ను నిర్మించడానికి ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చింది. రూ. 2 కోట్లు కూడా మంజూరు చేస్తూ ఉత్తర్వులు వచ్చాయి. మార్కెట్‌ను ఎలాంటి సౌకర్యాలతో నిర్మించాలనే దానిపై మత్స్యకార సంఘాలతో చర్చిస్తున్నాం. నిర్మాణ బాధ్యతలు అప్పగించే అంశం కలెక్టర్ పరిధిలో ఉంది.
– రాజ నర్సయ్య, జిల్లా మత్స్యశాఖ అధికారి

పసుపు ధర పైపైకి..

- నిజామాబాద్‌లో క్వింటాలుకు రూ. 14,051 పలికిన ధర



సుభాష్‌నగర్ : నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో శుక్రవారం పసుపు ధర రికార్డు స్థాయిలో పలికింది. క్వింటాలుకు రూ.14,051 ధర వచ్చింది. సుమారు 70 క్వింటాళ్లు తీసుకొచ్చిన ఓ రైతుకు ఆ ధర రావడంతో సంతోషం వ్యక్తం చేశాడు. దీంతోపాటు మరో 60 క్వింటాళ్ల వరకు రూ. 13 వేలకు పైనే ధర పలికింది. పసుపు ధర సగటున రూ. 10 వేల పైచిలుకు పలకడం గమనార్హం. మండ సైతం ఎన్నడూ లేని విధంగా రూ. 10 వేల వరకు పలుకుతోంది. పచ్చ బంగారం ధర పైపైకి పెరగడంతో పసుపు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో పసుపునకు డిమాండ్ పెరుగుతుండటమే ధర రావడానికి కారణమని వ్యాపారులు పేర్కొంటున్నారు. రానున్న రోజుల్లో రూ. 20వేలు అయినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదన్నారు. నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో 2010–11లో అత్యధికంగా క్వింటాలుకు రూ. 16,750 ధర పలికింది.

పునర్నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలి

- అదుపులోనే జిల్లాలో పరిస్థితి
- ప్రజలు అధైర్యపడొద్దు
- మంత్రి ప్రశాంత్ రెడ్డి

బాల్కొండ : అధిక వర్షాల వల్ల తెగిన రోడ్లను చెరువు కట్టలను వెంటనే పునర్నిర్మించాలని ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖ అధికారులకు ఆదేశాలిచ్చినట్లు రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌ను సందర్శించారు. ప్రాజెక్ట్ ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్ట్ నుంచి గోదావరిలోకి కొనసాగుతున్న నీటి విడుదలను, నీటి నిల్వను పరిశీలించారు. అలాగే బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలో రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాల వల్ల నష్టపోయిన పంటలను, తెగిపోయిన రోడ్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. జిల్లాలో అతి భారీ వర్షాలు కురుస్తున్నందున తెగిన రోడ్లకు, చెరువు కట్టలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులకు ఆదేశించించామన్నారు. ప్రస్తుతం తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టి, మళ్లీ పూర్తిస్థాయి ప్రతిపాదనలు తయారు చేసి శాశ్వత మరమ్మతులు చేపడ్తామన్నారు. జిల్లాలో 7 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరదలు సకాలంలో రావడం లేదని సీఎం కేసీఆర్ కాళేశ్వరం నీళ్లను ఎదురెక్కించారన్నారు. కాని దేవుడు కరుణించి ఎగువ నుంచి వరదలు రావడంతో ప్రాజెక్ట్ నిండుకుండలా మారిందన్నారు. ప్రాజెక్ట్‌లో 82 టీఎంసీల వరకు నిల్వ ఉంచుతూ ఎగువ నుంచి వచ్చే వరదల ఆధారంగా గోదావరిలోకి నీటిని విడుదల చేయాలని సీఎం పేర్కొన్నారన్నారు. ప్రాజెక్ట్ వద్ద పర్యాటకంగా ఎక్కడ అభివృద్ధి పనులు చేపడితే బాగుంటుందని ప్రాజెక్ట్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వెల్కటూర్ వద్ద పెద్దవాగును పరిశీలించారు. పెద్దవాగు పక్కన ఉన్న పంటల్లో విద్యుత్తు స్తంభాలు కొట్టుకుపోయాయని మంత్రి దృష్టికి రైతులు తెచ్చారు. ట్రాన్స్‌కో అధికారులకు మంత్రి వెంటనే ఆదేశాలు జారీ చేశారు.


శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటి విడుదలను పరిశీలిస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

నిజమైన నాయకుడు కేసీఆర్..

బాల్కొండలో అధికంగా వర్షాలు కురుస్తున్నాయన్న విషయాన్ని తెలుసుకుని సీఎం కేసీఆర్ తనకు ఫోను చేశారన్నారు. అధైర్యపడకు.. ప్రజల వెంటే ఉండాలని క్షేత్ర స్థాయిలో నష్టాన్ని పరిశీలించాలని, తాను న్నానని ధైర్యం చెప్పారన్నారు. ప్రాజెక్ట్ ఎస్ఈ శ్రీనివాస్, ఈఈ చక్రపాణి తదితరులున్నారు.

క్లుప్తంగా

అలీసాగర్ రెండు గేట్ల ఎత్తివేత



ఎడపల్లి: భారీ వర్షాలతో మండలంలోని చెరువులు, కుంటలు, వాగులు పొంగి పొర్లుతున్నాయి. అలీ సాగర్ రిజర్వాయర్‌లోకి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరుకుంది. దీంతో అధికారులు రెండు గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం వరకు అలీ సాగర్ ట్యాంక్ లెవెల్ 1289.00 ఎంసీఎఫ్‌టీ ఉండగా, ప్రస్తుతం జలాశయంలోకి 1200 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోందని ఇరిగేషన్ డీఈ లోక్యానాయక్ తెలిపారు. సాయంత్రానికి వరద తగ్గడంతో ఒక గేటు ద్వారా 600 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నట్లు చెప్పారు. నీటి విడుదల చేపడుతుండటంతో రిజర్వాయర్‌ను చూడటానికి ప్రజలు తరలి వస్తున్నారు.

మినిసో షోరూం ప్రారంభం



నిజామాబాద్ సిటీ: నగరంలోని వేణుమాల్‌లో మినిసో షోరూంను సినీ నటి హిమజ శుక్రవారం ప్రారంభించారు. షోరూం నిర్వాహకుడు భాస్కర్ మాట్లాడుతూ తెలంగాణలో మూడో షోరూం నిజామాబాద్‌లో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇక్కడ రూ. 500 నుంచి రూ.1000 వరకు 60 రకాల ప్రొడక్టులు లభ్యం అవుతాయన్నారు. త్వరలో కరీంనగర్, వరంగల్, నాగ్‌పూర్‌లో షోరూంలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

సంక్షేమ హాస్టళ్లకు భవనాలు నిర్మించాలి




నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో సంక్షేమ వసతి గృహాలకు నూతన భవనాలు నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాచకొండ విఘ్నేష్ డిమాండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా వసతి గృహాల సమస్యలపై చేపట్టిన జీపుయాత్ర శుక్రవారం నగరంలో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం హాస్టళ్లను పట్టించుకోవడం లేదన్నారు. జిల్లాలోని ప్రభుత్వ హాస్టళ్లలో అనేక సమస్యలు నెలకొన్నాయని పేర్కొన్నారు. హాస్టళ్లో మినరల్ వాటర్ ప్లాంట్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో విద్యార్థులు నల్లా నీళ్లు తాగి రోగాల బారీన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు నాగరాజు, మహేష్, దీపిక, జవహర్, గణేష్, సంధ్యారెడ్డి, అరవింద్, శివ, బాబు రావు పాల్గొన్నారు.

మూడు కేజ్‌వీల్ ట్రాక్టర్ల సీజ్

బాల్కొండ: మెండోరా మండలంలో కేజీవీల్స్‌తో తారు రోడ్డుపై వెళ్తున్న మూడు ట్రాక్టర్‌ను శుక్రవారం సీజ్ చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. కేజీవీల్స్‌తో పట్టిలు లేకుండా రోడ్డుపై వెళ్లడంతో ధ్వంసం అయిందన్నారు.

త్వరలో తహసీల్దార్ల బదిలీలు!

- 25 మందికి పైగా స్థానచలనం
- ప్రక్రియ పూర్తి చేసిన సీసీఎల్‌ఏ



సుభాష్‌నగర్: రాష్ట్రంలో త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో, కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారుల బదిలీలను ప్రభుత్వం చేపడుతోంది. ఇప్పటికే అదనపు కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీవోల బదిలీ ప్రక్రియ పూర్తయ్యింది. ఇక మిగిలింది తహసీల్దార్ల బదిలీలే. దీంతో జిల్లావ్యాప్తంగా దాదాపు 25మందికిపైగా స్థానచలనం కలిగే అవకాశముంది. మాక్లూర్ సహా మరో ఐదారుగురు ఎన్నికల నిర్వహణ బాధ్యతల నిమిత్తం జిల్లాలో కొనసాగనున్నారు. డిప్యూటీ కలెక్టర్ల పదోన్నతుల ప్రక్రియ కొలిక్కి వచ్చిన వెంటనే తహసీల్దార్ల బదిలీలపై ఉత్తర్వులు వెలువడే అవకాశముంది. జులై 31లోపు బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని ఎన్నికల సంఘం ఆదేశాలిచ్చిన విషయం తెలిసిందే.

జిల్లాలో 33మంది తహసీల్దార్లు..

జిల్లాలో 33మంది తహసీల్దార్లు విధులు నిర్వర్తిస్తున్నారు. మండలాలతోపాటు కలెక్టరేట్‌లో ఆయా సెక్షన్లకు తహసీల్దార్ స్థాయి హోదా కలిగిన అధికారులు ఉన్నారు. మాక్లూర్ తహసీల్దార్ శంకర్ మినహా మిగతా 32మంది తహసీల్దార్లు మూడేళ్ల పదవీకాలాన్ని పూర్తిచేసుకున్నారు. కానీ ఐదారుగురు జిల్లాలోనే ఎన్నికల నిర్వహణ బాధ్యతలు చేపట్టనున్నారు. వీరు కాకుండా జిల్లా నుంచి 25 మందికిపైగా బదిలీ అయ్యే అవకాశముంది.

కోరుకున్న స్థానాలకు..

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బదిలీ తప్పనిసరి అని భావించిన తహసీల్దార్లు కోరుకున్న స్థానాలకు వెళ్లేందుకు చకచకా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. సీసీఎల్ఏ నిర్ణయం మేరకే బదిలీలు ఉంటాయని చెప్తున్నా.. క్షేత్రస్థాయిలో ఎవరు ఎక్కడికి వెళ్తారో తహసీల్దార్లకు ఇప్పటికే స్పష్టత ఉంది. ఆర్డీవోలు, తహసీల్దార్లు మల్టీజోన్ పరిధిలోకి వస్తారు. సొంత జిల్లాల్లో పోస్టింగ్ ఇవ్వరాదు. మన జిల్లా నుంచి కామారెడ్డి, నిర్మల్, మెదక్ జిల్లాలకు బదిలీపై వెళ్తారు. ఆయా జిల్లాల్లో మండలాలను అలాట్ చేస్తారు. కాగా స్థానిక ఎమ్మెల్యేలు సైతం తమకు అనుకూలంగా ఉండే వారినే నియోజకవర్గాల్లో పోస్టింగ్‌లు ఇప్పించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు అధికారిక వర్గాల ద్వారా తెలిసింది.

త్వరలోనే అధికారిక ఉత్తర్వులు..

రెవెన్యూ అధికారుల బదిలీల ప్రక్రియ తుది అంకానికి చేరింది. రాష్ట్రవ్యాప్తంగా 81మంది తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్ పదోన్నతులను (ఆర్డీవోలుగా) ఇటీవల కల్పించింది. ప్రస్తుతం 21 మందికి అవకాశం కల్పించింది. వారి సర్దుబాటు ప్రక్రియ పూర్తికాగానే తహసీల్దార్ల బదిలీలపై అధికారికంగా ఉత్తర్వులు వెలువడే అవకాశముంది. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) యాదిరెడ్డి, మూడు డివిజన్ల ఆర్డీవోలు ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. రిటర్నింగ్ అధికారులుగా ఆర్డీవోలు, అసిస్టెంట్ ఎలక్షన్ రిజిస్ట్రేషన్ అధికారులుగా తహసీల్దార్లు వ్యవహరించనున్నారు.

ఇంకా సమాచారం లేదు

తహసీల్దార్ల బదిలీలకు సంబంధించి అధికారిక ఉత్తర్వులు సీసీఎల్‌ఏ నుంచి వస్తాయి. బదిలీ ఉత్తర్వులు ఎప్పుడిస్తారో సమాచారం లేదు.

– యాదిరెడ్డి, అదనపు కలెక్టర్, నిజామాబాద్

‘పేదలను ఆదుకోవడంలో ముందుంటా’



బాధితులతో మాట్లాడుతున్న ధన్‌పాల్

సుభాష్‌నగర్: పేదల కష్టాల్లో పాలుపంచుకుని, వారిని ఆదుకోవడంలో ముందుంటానని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని 38, 22, 34వ డివిజన్లలో ఆయన పర్యటించారు. వర్షాలకు కూలిపోయిన ఇండ్లను పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి 15 రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు, తక్షణంగా ఆర్థికసాయాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల కష్టసుఖాలను తెలుసుకుని ఆదుకుంటానని తెలిపారు. డబుల్‌బెడ్‌రూం ఇండ్లు, ఖాళీ స్థలం ఉన్న వారికి రూ.ఐదు లక్షలు ఇస్తానని ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా మోసం చేశారని ఆరోపించారు. 22వ డివిజన్‌లో నూతనంగా వేసిన రోడ్డు కొన్ని రోజులకే చెడిపోయిందని స్థానికులు ఆయనకు చెప్పారు. దీంతో ధన్‌పాల్ అదనపు కలెక్టర్ యాదిరెడ్డితో ఫోన్లో మాట్లాడారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని, లేకుంటే స్థానికులతో కలిసి పోరాటం చేస్తామన్నారు. మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ గోపిడి స్రవంతి రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ పంచరెడ్డి లింగం, నాగోళ్ల లక్ష్మీనారాయణ, పంచరెడ్డి శ్రీధర్, మాస్టర్ శంకర్, ఎర్రం సుధీర్, వినోద్, భరత్ భూషణ్, నారాయణ యాదవ్ పాల్గొన్నారు.

ఇంటికి పంపని ప్రిన్సిపాల్

- అనుమతి లేకుండా వెళ్లిపోయిన విద్యార్థులు
- ధర్మారం(బి) గురుకుల కాలేజీలో ఘటన

నిజామాబాద్‌అర్బన్: డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) బీసీ గురుకుల కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకుల మధ్య వాగ్వాదం జరిగింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ప్రభుత్వం విద్యా సంస్థలకు సెలవులు ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో కాలేజీలోని విద్యార్థులు ఇళ్లకు వెళ్తామని కళాశాల ప్రిన్సిపాల్‌ను కోరగా ఆయన అనుమతి లేదంటూ నిరాకరించారు. దీంతో రెండు రోజులుగా విద్యార్థులు, ప్రిన్సిపల్, అధ్యాపకుల మధ్య సెలవుల విషయంలో గొడవ జరుగుతోంది. కాగా శుక్రవారం 29 మంది విద్యార్థులు అనుమతి ఇవ్వకున్నా ఇంటికి వెళ్లిపోయారు. కాలేజీలో మొత్తం 280 మంది విద్యార్థులు చదువుతున్నారు. కాగా మరికొందరు విద్యార్థులు మాత్రం కళాశాలలో భోజనం సక్రమంగా పెట్టడం లేదని, నీటి సమస్య తీవ్రంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు విద్యార్థులకు కండ్ల కలక వచ్చిందని, అది వ్యాప్తి చెందుతుందని భయంతో ఇంటికి వెళ్తామని చెప్పగా అధ్యాపకులు అనుమతి ఇవ్వలేదని విద్యార్థులు చెబుతున్నారు. ఈ ఘటనపై బీసీ గురుకుల జిల్లా కో ఆర్డినేటర్ సత్యనాథ్ రెడ్డిని వివరణ కోరగా ప్రిన్సిపాల్ అనుమతి ఇవ్వకున్నా కొందరు విద్యార్థులు ఇళ్లకు వెళ్లారని చెప్పారు.

విత్తనోత్పత్తి క్షేత్ర భూముల స్వాధీనం



పంట పొలాల్లోకి వెళ్లకుండా ట్రాక్టర్‌ను అడ్డుకుంటున్న గ్రామస్తులు

- రైతులు వేసిన పంటలను దున్నేసిన అధికారులు



ట్రాక్టర్‌తో పంటను నాశనం చేస్తున్న దృశ్యం

నస్రుల్లాబాద్: మండలంలోని బొప్పాస్‌పల్లి గ్రామంలో గల విత్తనోత్పత్తి క్షేత్రం భూములను గ్రామస్తులు కబ్జా చేసి పంట వేశారు. క్షేత్ర అధికారులు శుక్రవారం పోలీసుల సహకారంతో ఆ భూములను స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. విత్తనోత్పత్తి క్షేత్రంలో 542 ఎకరాలు ఉండాల్సి ఉంది. అయితే అధికారుల లెక్కల ప్రకారం 472 ఎకరాల భూమి ఉన్నట్లు తహసీల్దార్ లెక్కలు చెబుతున్నాయి. ఇందులో 120 ఎకరాల వరకు అధికారులు సాగు చేస్తున్నారు. మిగతా భూమిలో సుమారు 100 ఎకరాలకు పైగా బొప్పాస్‌పల్లి, బైరాపూర్ గ్రామ రైతులు కబ్జాకు పాల్పడి పంట సాగు చేస్తున్నారు. ఈ సీజన్‌లో సైతం రైతులు పంట వేయగా అధికారులు శుక్రవారం కేజీవీల్ ట్రాక్టర్‌తో పంటను నాశనం చేసి భూమి స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నం చేశారు. పంటలు వేయడానికి ముందు స్పందించని అధికారులు ఇప్పుడు దున్నివేయడం సరికాదని, కావాలంటే పంటను మీరే తీసుకుని కూలి డబ్బులు చెల్లించాలని రైతులు వేడుకున్నారు. అయినా అధికారులు వినకపోవడంతో రైతులు వారిని అడ్డుకున్నారు. ఎస్సై రంజిత్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్తులను సముదాయించి అధికారులు భూములను స్వాధీనం చేసుకునేలా చేశారు. ఈ విషయమై ఏడీఏ అనిల్‌కుమార్‌ను వివరణ కోరగా తాను సెలవులో ఉన్న సమయంలో పంటలు వేశారని చెప్పారు. పలుమార్లు హెచ్చరించినా కూడా పంట సాగు చేస్తున్నారన్నారు. క్షేత్ర భూములు ఎవరు కబ్జా చేసినా ఊరుకోమన్నారు.

వివాదాస్పద స్థలంలో సర్వే



సర్వే చేస్తున్న అధికారులు

మోపాల్: మండల కేంద్రంలోని వివాదాస్పద స్థలంలో అధికారులు శుక్రవారం సర్వే నిర్వహించారు. గ్రామ యువకులు, భూ బాధితుల ఫిర్యాదు మేరకు డీఎల్‌పీఓ నాగరాజు, తహసీల్దార్ లత, ఎంపీడీవో లింగం, ఎంపీవో ఇక్బాల్, ఆర్ఐ రాజేశ్వర్, సర్వేయర్ స్వప్న సర్వే చేశారు. 449/ఏ, 344/5 సర్వే నంబర్‌లో అక్రమ కట్టడాలు చేపడుతున్నారని, అక్రమ రిజిస్ట్రేషన్ చేస్తున్నారని అధికారులకు ఫిర్యాదు చేశారు. 1.16 ఎకరాల భూమిని పలువురు దొంగ రిజిస్ట్రేషన్ చేసుకుని ఇండ్లు నిర్మించుకుంటున్నారని ప్రధాన ఆరోపణ. దీనిపై పలుమార్లు యువకులు ప్రజావాణిలో ఫిర్యాదుచేశారు. సర్వే రిపోర్టును కలెక్టర్‌కు అందజేస్తామని అధికారులు పేర్కొన్నారు.

చోరీ కేసులో ఒకరి రిమాండ్

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలో వరుస చోరీలకు పాల్పడిన ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 23న గాంధీనగర్‌లోని వాల్మీకిబోయ, ఆంజనేయస్వామి ఆలయాల్లో చోరీ జరిగింది. దొంగలు హుండీలను చోరీ చేశారు. అంతేకాకుండా గాంధీగంజ్‌లోని వెంకటేశ్వర ట్రేడర్స్ దుకాణంలో దొంగతనానికి యత్నించారు. ఈనెల 7న రైల్వేగేట్ సమీపంలోని మూమెంట్స్ హోటల్లో చోరీ జరిగింది. ఆయా కేసుల పరిశోధన నిమిత్తం పట్టణ పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విచారణ కొనసాగించారు. వేలిముద్రల ఆధారంగా నిందితుడిని గాంధీ నగర్‌లో నివాసం ఉండే బెల్లపు రాజుగా గుర్తించారు. అతని స్వగ్రామం మాచారెడ్డి మండలం అక్కాపూర్ అని పట్టణ ఎస్‌హెచ్‌వో నరేష్ తెలిపారు. నిందితుడు పాత నేరస్తుడు. జిల్లా కేంద్రంలో అతడిని శుక్రవారం పట్టుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. అతడిని కోర్టులో హాజరు పర్చినట్లు వెల్లడించారు.

దరఖాస్తులు బుట్ట దాఖలేనా?

- మైనారిటీ కార్పొరేషన్ రుణాలకు పలువురి దరఖాస్తు
- నిధులు మంజూరు చేయని ప్రభుత్వం

మోర్తాడ్: మైనారిటీ కార్పొరేషన్ ద్వారా బ్యాంకు లింకేజీతో రాయితీ రుణాలను పొందాలని దరఖాస్తు చేసుకున్న వారి ఆశలు ఇప్పటికీ నెరవేరలేదు. అంతలోనే ఇదే సంస్థ ద్వారా మైనారిటీలకు రూ.లక్ష సాయం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. బీసీల్లోని కులవృత్తులపై ఆధార పడినవారి మాదిరిగానే మైనారిటీలకు కూడా రూ.లక్ష సాయం అందిస్తామని సీఎం ప్రకటించారు. మైనారిటీ కార్పొరేషన్ ద్వారా 324 యూనిట్లకు రాయితీ రుణాలు ఇస్తామని 2022–23 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఇప్పటి వరకు నయాపైసా సాయం అందించలేదు. అంతలోనే రూ.లక్ష సాయం ప్రకటన వెల్లడించారు. గతంలో రాయితీ రుణాల కోసం 13,105 మంది దరఖాస్తు చేసుకున్నారు. తాజాగా మళ్లీ రూ.లక్ష సాయం అందిస్తామని ప్రకటించడంతో కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ తతంగం చూస్తుంటే గతంలో అందించిన దరఖాస్తులు బుట్ట దాఖలైనట్లే అనే సందేహం వ్యక్తమవుతోంది. ఇది ఇలా ఉండగా ఎమ్మెల్యేల సిఫారసుతోనే లక్ష సాయానికి లబ్ధిదారులను ఎంపిక చేస్తారనే ప్రచారం జరుగుతోంది. దీంతో అధికార పక్షం బడా నేతలను ప్రసన్నం చేసుకోవడానికి మైనారిటీలు తంటాలు పడుతున్నారు.

వేగంగా సాయం అందించాలి



మైనారిటీలకు ఆర్థిక సాయం అందించే విషయంలో ప్రభుత్వం చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నాం. మైనారిటీలలో ఎంతో మంది నిరుద్యోగులు ఉన్నారు. వారికి వేగంగా సాయం అందించాలి.

– అజారొద్దీన్, మైనారిటీ నాయకుడు, తిమ్మాపూర్

లోకాయుక్త విచారణకు జీజీహెచ్ సూపరింటెండెంట్ గైర్హాజరు

నిజామాబాద్ సిటీ : జిల్లా కేంద్రంలోని జిల్లా జనరల్ ప్రభుత్వ ఆస్పత్రిలో రెమిడెసివిర్ ఇంజక్షన్ల మిస్సింగ్ ఘటనపై ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ శుక్రవారం లోకాయుక్త ఎదుట హాజరు కావాల్సి ఉండగా గైర్హాజరయ్యారు. కరోనా మొదటి, రెండో దశలో జిల్లా ఆస్పత్రిలో కోవిడ్ సెంటర్‌కు ప్రభుత్వం రెమిడెసివిర్ ఇంజక్షన్లు సరఫరా చేసింది. వీటిని దుర్వినియోగం చేశారన్న ఆరోపణలపై సమాచార హక్కు చట్టం కింద రికార్డుల పరిశీలనకు కౌన్సిల్ ఫర్ సివిల్ రైట్ అనే సంస్థ ప్రతినిధులు ప్రయత్నించారు. కానీ వీరిపై జీజీహెచ్ సూపరింటెండెంట్ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో సీసీఎస్ ప్రతినిధులపై కేసు నమోదైంది. దాంతో ప్రతినిధులు లోకాయుక్తలో ఫిర్యాదు చేయగా 28న లోకాయుక్త ఎదుట హాజరు కావాలని నోటీసులు జారీ చేసింది. శుక్రవారం లోకాయుక్త ఎదుట సీసీఆర్ కార్యదర్శి రాజశేఖర్ హాజరుకాగా సూపరింటెండెంట్ హాజరుకాలేదు. రెమిడెసివిర్ మిస్సింగ్ వ్యవహారంపై ఆస్పత్రి వర్గాలు లోకాయుక్తకు నివేదికలు సమర్పించలేదని తెలిసింది.

ఆటో చోరీ కేసులో ఒకరి అరెస్ట్



ఖలీల్‌వాడి: ఆటో దొంగతనాలకు పాల్పడుతున్న ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. వివరాలు.. మోపాల్ మండలం మంచిప్ప గ్రామానికి చెందిన కుమ్మరి రాజు (27) ఆటోలు దొంగతనాలు చేసినట్లు చెప్పారు. నిందితుడి నుంచి రూ. 9 లక్షల విలువ చేసే ఆరు ఆటోలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఏడాది క్రితం జైలు నుంచి వచ్చిన రాజు ఆటోలను చోరీ చేసి అమ్ముతూ జులాయిగా తిరుగుతున్నట్లు చెప్పారు. గత డిసెంబర్‌లో జీజీహెచ్ నుంచి ఆటోను దొంగలించారని, దీనితోపాటు మరో 5 ఆటోలు, నాలుగవ టౌన్ పరిధిలోని ఒక ఆటోను దొంగిలించినట్లు వివరించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో సుదర్శనం, అధికారులు

నిజామాబాద్ సిటీ: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో సుదర్శనం సూచించారు. జిల్లాలో ప్రజలు సీజనల్ వ్యాధులకు గురికాకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. శుక్రవారం తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో వారం రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయని, వరదలతో రాకపోకలు స్తంభించే అవకాశం ఉన్న ప్రాంతాలలో 10 రోజుల్లో డెలివరీలకు ఉన్న గర్భిణులను ముందస్తుగా ఆస్పత్రులకు తరలించేందుకు యాక్షన్‌ప్లాన్ తయారు చేసినట్లు తెలిపారు. ప్రజలు తమ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం కలుషిత నీళ్లు, ఆహారంతో కలిగే వ్యాధులపై ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

పీటీసీల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ సిటీ: ఆకాశవాణి పార్ట్‌టైమ్ కరస్పాండెంట్ల(పీటీసీ)ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆకాశవాణి డిప్యూటీ డైరెక్టర్ మహేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. పీటీసీల పోస్టులు నిజామాబాద్, కామారెడ్డి జిల్లా కూడా ఖాళీలు ఉన్నాయని చెప్పారు. 24 నుంచి 45 ఏళ్ల వయస్సుగల వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు newsonair. gov.in నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకొని, పూర్తి చేసిన దరఖాస్తుకు స్వయం ధృవీకరణ సర్టిఫికెట్, ఫొటోలు జతపరిచి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆకాశవాణి, సైఫాబాద్, హైదరాబాద్ 500004 చిరునామాకు ఈ నెల 31లోగా పంపాలని సూచించారు.

క్రైం కార్నర్

మూడు ఇళ్లలో చోరీ

వర్ని: మండలంలోని జలాల్పూర్ గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున మూడు ఇళ్లలో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన నాగయ్య, ప్రమోద్ జోషి, బీడీ కార్ఖానాలో చోరీ జరిగినట్లు ఎస్సై కృష్ణ తెలిపారు. సుమారు రూ.75 వేల విలువగల నగదు, బంగారం పోయినట్లు ఆయన చెప్పారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

మోపాల్: మండలంలోని మంచిప్పలో జల్లపురం మౌనిక (25) ఉరేసుకుని శుక్రవారం సాయంత్రం ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు, పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం గాంధారి మండలం చద్మల్‌కు చెందిన మౌనికకు, మంచిప్పలోని సాయికుమార్‌తో రెండేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ప్రస్తుతం 13 నెలల బాబు ఉన్నాడు. సాయికుమార్ జేసీబీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గత కొన్నిరోజులుగా వీరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ జరగగా, నచ్చజెప్పారు. కుటుంబ కలహాలతో మౌనిక శుక్రవారం సాయంత్రం ఇంట్లోనే దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కాగా తమ కుమార్తెను హత్య చేశారని మౌనిక తరఫున బంధువులు ఆరోపిస్తున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న డీఎస్పీ సురేశ్

భిక్కనూరు: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరగవని కామారెడ్డి డీఎస్పీ సురేశ్ అన్నారు. మండలంలోని గుర్జకుంటలో శుక్రవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలకు జరిమానాలను విధించారు. పెండింగ్ చాలన్‌లు ఉన్నా వాహనాదారులనుంచి జరిమానాలను వసూలు చేశారు. డీఎస్పీ సురేశ్ మాట్లాడుతూ పేకాడినా, బెల్టుషాపులు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, ఎవరికి బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు చెప్పొద్దని సూచించారు. సర్పంచ్ మనోరమ రమేశ్‌రెడ్డి, సీఐ తిరపయ్య, ఎస్సైలు ఆనంద్‌గౌడ్, హైమద్, గాంధీగౌడ్, రాజు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి పలువురి మృతి



సాయిలు (ఫైల్)

బాన్సువాడ రూరల్: మండలంలోని తాడ్కోల్ గ్రామానికి చెందిన బక్కని సాయిలు(35) గురువారం చేపల వేటకు వెళ్లి చెరువులో గల్లంతు అయ్యాడు. రాత్రి ఇంటికి రాకపోవడంతో శుక్రవారం చెరువుగట్టుపై చూడగా చెప్పులు, బట్టలు కనిపించాయి. చెరువులో గాలించగా మృతదేహం లభ్యమైంది. చేపల వల కాళ్లకు చుట్టుకోవడంతో మృతి చెందినట్లు మృతుని భార్య మౌనిక ఫిర్యాదు చేశారు. మృతుడికి కూతురు మనుస్మిత, కుమారుడు గంగాప్రసాద్ ఉన్నారు. టీసీసీసీ సభ్యుడు కాసుల బాలరాజు, బుడిమి సొసైటీ చైర్మన్ గంగుల గంగారాం బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు.

మల్కాపూర్ శివారులో ఒకరు



సాయారెడ్డి మృతదేహం తీసుకువస్తున్న దృశ్యం

నవీపేట: నవీపేట పోలీస్ స్టే షన్ పరిధిలోని మల్కాపూర్ శివారులోని చెరువులో శుక్రవారం చేపలు పట్టేందుకు వె ళ్లిన ఒకరు మృతి చెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. నిజామాబాద్ మండలంలోని గుండారం గ్రామానికి చెందిన సిర్నాపల్లి సాయారెడ్డి(52) చెరువు అలుగులో చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగాడని పేర్కొన్నారు. ఈత రాకపోవడంతో మృతి చెందాడని తెలిపారు. మృతుడి భార్య సుమలత ఫిర్యాదు కేసు నమోదు చేశామన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

నిజాంసాగర్: నల్లవాగు మత్తడి వరద నీటిలో గల్లంతైన జంగం కృష్ణ (48) మృత దేహం శుక్రవారం లభ్యమైందని ఎస్సై నాగగోని రాజు తెలిపారు. పిట్లంకు చెందిన జంగం కృష్ణ చేపల వేట కోసం నల్లవాగు మత్తడి దిగువన వాగు ఒడ్డుకు వచ్చాడు. వరద ఉధృతి పెరగడంతో కృష్ణ నీటిలో కొట్టుకుపోయాడు. కృష్ణ కోసం గాలింపు చేపట్టగా గల్లంతైన ప్రదేశం నుంచి కిలోమీటర్ దూరంలో చెట్టు కొమ్మకు తట్టుకొని మృతదేహం లభ్యమైంది.

తీర్థయాత్రలకు వెళ్లి మృత్యు ఒడికి..

- తమిళనాడు రోడ్డు ప్రమాదంలో ఆర్మూర్‌వాసి మృతి



అవినాష్‌గౌడ్(ఫైల్)

ఆర్మూర్‌టౌన్: తమిళనాడు రాష్ట్రంలో శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్మూర్ పట్టణానికి చెందిన అవినాష్‌గౌడ్(23) మృతి చెందాడు. వివరాలు.. పట్టణంలోని జర్నలిస్టుకాలనీలో ఉండే రమేష్‌గౌడ్ ఆయన కుమారుడు అవినాష్‌గౌడ్, హైదరాబాద్‌కు చెందిన సినీ కళాకారుడు జుట్టు వెంకట్, వేల్పూర్ మండలం పోచంపల్లికి చెందిన గంగాధర్‌గౌడ్, ఆర్మూర్‌కు చెందిన బద్రి, చిట్టాపూర్‌కు చెందిన నర్సింలు ఐదు రోజుల క్రితం కారులో తీర్థయాత్రలకు బయలుదేరారు. యాత్రలో భాగంగా తమిళనాడులోని కంచి ఆలయానికి వెళ్లే మార్గంలో వీరు ప్రయాణిస్తున్న వాహనం రోడ్డుపై ఆగి ఉన్న బస్సును ఢీకొంది. ఈ ఘటనలో అవినాష్‌గౌడ్, జుట్టు వెంకట్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. రమేష్‌గౌడ్, బద్రి, గంగాధర్‌గౌడ్ పరిస్థితి విషమంగా ఉంది. స్థానికుల క్షతగాత్రులను కంచి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో ఒకరికి నాలుగు రోజుల జైలు

తాడ్వాయి: డ్రంకన్ డ్రైవ్ కేసులో ఒకరికి నాలుగు రోజుల జైలు శిక్ష పడినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. వాహనాల తనిఖీలో గాంధారి మండలం బీర్మల్ తండాకు చెందిన గోతిమోహన్‌రాజు మద్యం తాగి బైక్ నడుపుతు దొరికాడన్నారు. కేసు నమోదు చేసి మోహన్‌రాజును శుక్రవారం కామారెడ్డి కోర్టులో హాజరు పరచగా ద్వితీయశ్రేణి న్యాయమూర్తి ప్రతాప్ అతనికి నాలుగు రోజుల జైలు శిక్ష, రూ.400 జరిమానా విధించారని తెలిపారు.

బస్సును ఢీకొన్న కంటైనర్



భిక్కనూరు: మండలంలోని బస్వాపూర్ శివారులో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలికి తీవ్రగాయాలైనట్లు ఎస్సై ఆనంద్‌గౌడ్ శుక్రవారం తెలిపారు. బోధన్ డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు హైదరాబాద్ నుంచి బోధన్‌కు వెళ్తుండగా మండలంలోని బస్వాపూర్ శివారులో వెనుక నుంచి కంటైనర్ ఢీకొంది. ప్రమాదంలో కంటైనర్ డ్రైవర్‌తో పాటు బస్సులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయలయ్యాయి. బోధన్ పట్టణానికి చెందిన ధనలక్ష్మి అనే వృద్ధురాలికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు ధనలక్ష్మిని హైదరాబాద్ తరలించినట్లు ఎస్సై వివరించారు. బస్సు డ్రైవర్ చలపతిరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.